## రుణమాఫీ ధర్నాకు తరలిన నాయకులు



రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయాలని కోరుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లా తొర్రూర్‌లో చేపట్టిన రైతు రుణమాఫీ ధర్నాకు ఉప్పల్ నాయకులు శుక్రవారం తరలివెళ్లారు. ఈ మేరకు మాజీ మంత్రులు హరీశ్‌రావు, దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మాజీ డిప్యూటీ సీఎం రాజయ్యతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. నాయకులు పిల్లి నాగరాజు, మంచికంటి రాజవర్ధన్ గుప్తా పాల్గొన్నారు.

- ఉప్పల్

## జోనల్ వాలీబాల్ టోర్నమెంట్‌కు నాచారం విద్యార్థులు ఎంపిక



సీబీఎస్ఈ క్లస్టర్ జోనల్ వాలీబాల్ టోర్నమెంట్‌లో నాచారం సెయింట్ పీటర్స్ విద్యార్థులు ఎంపిక అయ్యారు. రాజమండ్రిలో నాలుగు రోజుల పాటు జరిగే టోర్నమెంట్‌లో వీరు పాల్గొంటారని ట్రైనర్ సందీప్ శుక్రవారం తెలిపారు. విద్యార్థులు ఉనిత్, భార్గవ్ తేజ, జస్మిత్ సాయి, సాయివివేక్, అవినాశ్, హజ్రల్, శ్యామ్ సుందర్, మనోజ్ నాయక్ పోటీల్లో పాల్గొనున్నట్లు చెప్పారు.

- ఉప్పల్

## కార్మికులకు దుస్తులు పంపిణీ



పోచారం మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులకు చైర్మన్ కొండల్‌రెడ్డి దసరా కానుకగా దుస్తులు పంపిణీ చేశారు. సొంతఖర్చులతో అన్నోజిగూడలోని ఆయన నివాసంలో 360 మంది కార్మికులకు తల్లిదండ్రులు బోయపల్లి మల్లారెడ్డి దశలక్ష్మి చేతుల మీదుగా భోజనం ఏర్పాటు చేసి దుస్తులు పంపిణీ చేశారు. కుటుంబ సభ్యులు సత్తిరెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, రఘురాంరెడ్డి పాల్గొన్నారు.

- ఘట్‌కేసర్

# నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



బాబానగర్‌లో భూగర్భ డ్రైనేజీ పనులకు కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



విద్యార్థిని అభినందిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్, అక్టోబర్ 4 : అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.నియోజకవర్గంలోని ప్రతీ డివిజన్‌లో దశలవారీగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే మల్లాపూర్ డివిజన్ పరిధిలోని బాబానగర్ కాలనీలో 17 లక్షల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ పనులకు కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. దుర్గానగర్ కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీల్లో సమస్యలు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. జరుగుతున్నటు వంటి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సదరు కాంట్రాక్టర్, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జలమండలి ఏఈ వేణుగోపాల్, జీహెచ్ఎంసీ ఏఈ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, స్థానిక నాయకులు దయాకర్‌రెడ్డి, ప్రవీణ్, మహేందర్, ఉస్మాన్, శ్రీశైలం, విఘ్నేశ్, రామాంజి రహీంమూర్తి, గౌస్, రాజేశ్, నర్సింగ్ పాల్గొన్నారు.

### విద్యార్థులకు అండగా నిలుస్తా

ఉప్పల్, అక్టోబర్ 4 : ఉత్తమ ప్రతిభ చాటుతూ ఉన్నతవిద్య అభ్యసించే విద్యార్థులకు తోడ్పాటు అందిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. నాచారం రాఘవేంద్ర నగర్‌కు చెందిన మహమ్మద్ ఖాజా నీట్‌లో ఉత్తమర్యాంక్ సాధించాడు. ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్ సహకారంతో ఎమ్మెల్యేను కలిశారు.

పేద విద్యార్థులకు ఫీజు చెల్లిస్తున్న ఎమ్మెల్యేను కలిసి, పరిస్థితి వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే ఐదేండ్ల పాటు ఫీజును చెల్లిస్తానని, మంచిగా చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సాయిజెన్ శేఖర్, మహిళా నాయకురాలు ఆజ్మీర పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాలు కల్పిస్తాం



ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మచ్చబొల్లారం డివిజన్ కోర్టు యార్డ్ కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డ్రైనేజీ, సీసీ రోడ్లు, స్ట్రీట్ లైట్లు, వరద కాలువలను ఏర్పాటు చేస్తామని అన్నారు.

- మల్కాజిగిరి

## అన్నికాలనీలను అభివృద్ధి చేస్తాం



రామంతాపూర్ భగాయత్‌లో సమస్యలు వింటున్న జడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్

రామంతాపూర్,అక్టోబర్ 4 : రామంతాపూర్ భగాయత్ కాలనీలను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు. శుక్రవారం డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు, కార్పొరేటర్ శ్రీవాణితో కలిసి కేసీఆర్ నగర్ బాలాజీ నగర్ , అన్నపూర్ణ కాలనీ ప్రాంతాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ భగాయత్‌లోని కాలనీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలన్న కలెక్టర్ ఆదేశాల మేరకు పర్యటించామని , అన్ని కాలనీలను అభివృద్ధి చేస్తామన్నారు. కార్పొరేటర్ శ్రీవాణి మాట్లాడుతూ.. విలీన ప్రక్రియలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడి సహకరించారన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ఫ్యామిలీ డిజిటల్ కార్డును పక్కాగా రూపొందించాలి

మేడ్చల్, అక్టోబర్ 4 : ఫ్యామిలీ డిజిటల్ కార్డును పక్కాగా రూపొందించాలని కలెక్టర్ గౌతమ్ పొట్రు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మూడుచింతపల్లి మండలంలోని పోతారంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఇంటింటి సర్వేలో నమోదైన వివరాల నివేదికను జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తాతో కలిసి పరిశీలించారు.

కలెక్టర్ మా ట్లాడుతూ.. సర్వేలో కుటుంబాల వివరాలను తప్పులు దొర్లకుండా నమోదు చేయాలన్నా రు. డిజిటల్ కార్డులో మహిళలను యజమానులుగా నమోదు చేయాలని సూచించారు. గ్రామానికి వచ్చిన కలెక్టర్ దృష్టికి గ్రామస్తులు పలు సమస్యలను తీసుకువచ్చారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందిస్తూ త్వరలో పరిష్కరిస్తామన్నారు. ఆయన వెంట ఆర్డీవో ఉపేందర్ రెడ్డి, డీపీవో వెంకయ్య ఉన్నారు.

### పీహెచ్‌సీని సందర్శించిన కలెక్టర్..

పోతారం గ్రామ పర్యటన అనంతరం కలెక్టర్ గౌతం పొట్రు మూడుచింతలపల్లి మండల కేంద్రంలోని కామిడి వీరారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలో కలియ తిరిగి భవనం, కల్పించిన మౌలిక సదుపాయాలను పరిశీలించారు. రోజుకు ఎందరు ఓపీ పెషెంట్లు వస్తారని, సిబ్బంది ఎందరు ఉన్నారని వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. ప్రసవాల సంఖ్య, వ్యాక్సినేషన్, ఇమ్యూనైజేషన్ రిజిష్టర్లను తనిఖీ చేశారు. వివరాలను రిజిష్టర్‌లలో నమోదు చేయాలని ఆదేశించారు. జ్వరంతో వచ్చే వారికి పరీక్షలు నిర్వహించాలన్నారు. గా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన సేవలందిస్తూ మెజార్టీ ప్రజలు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలను అవగాహన కల్పించి, ఓపీ పేషెంట్ల సంఖ్యను పెంచాలని సూచించారు. మూడుచింపతల్లిలో నూతనంగా నిర్మిస్తున్న తాసీసిల్దారు కార్యాలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తా డీఎంహెచ్‌వో రఘునాథ స్వామి, వైద్యాధికారులు పాల్గొన్నారు.




మూడుచింతలపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ గౌతమ్




## కొనసాగుతున్న బతుకమ్మ సంబురాలు



గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి దంపతులు పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి బతుకమ్మ, కోలాటం ఆడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి చామకూర కల్పనా రెడ్డి, మల్లారెడ్డి విద్యా సంస్థల యాజమాన్య కమిటీ సభ్యురాలు షాలినీ రెడ్డి, ప్రిన్సిపాల్ మాధవీలత, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

- మేడ్చల్

## సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అమర్‌సింగ్ అన్నారు. శుక్రవారం 5వ డివిజన్‌కు చెందిన లబ్ధిదారులకు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్ మంజూరైన పత్రాలను డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, కార్పొరేటర్ బొడిగ స్వాతితో కలిసి అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు భీంరెడ్డి నవీన్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

- పీర్జాదిగూడ





కీసరగుట్ట ఆలయ ప్రాంగణంలో చండీహోమం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు శ్రీ స్వర్ణకవచ శివ దుర్గాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చిన అమ్మవారు (ఇన్‌సెట్‌లో..)


# గాయత్రీదేవిగా.. అమ్మవారు



పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలో గాయత్రి మాత ఆలయంలో నిజరూప దర్శనం



నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలో ..



ఉప్పల్ ఎస్‌బీహెచ్ (బ్యాంక్) కాలనీలో గాయత్రీ అలంకారంలో ఉన్న దుర్గాదేవికి మధుశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసిన ఆలయ కమిటీ సభ్యులు రమేశ్‌గౌడ్, శ్రీనివాస్, శేఖర్, వెంకటేశ్వర్లు, జ్యోతి, సునీత, సుజాత, కిరణ్మయి, పార్వతి,జ్యోతిర్మయి తదితరులు



ఉప్పల్‌లో అమ్మవారిని దర్శనం చేసుకొని పూజలు చేస్తున్న భక్తులు



ఏఎస్‌రావు నగర్ డివిజన్ కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీదేవి నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులను కాలనీ వాసులు సన్మానించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రాఘవరెడ్డి, మాజీ కార్పొరేటర్ పావనీ మణిపాల్‌రెడ్డి, కమిటీ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు. - కాప్రా

### డీజే సౌండ్ నిషేధం

కీసర : శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న డీజే సౌండ్‌ను నిషేధిస్తున్నామని కీసర సీఐ వెంకటయ్య తెలిపారు. కీసర పీఎస్‌కు వివిధ గ్రామాల డీజీ నిర్వాహకులను పిలిపించి సమావేశం నిర్వహించారు. సీ ఎలాంటి అవాంచనీయ ఘటనలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు , నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్న భక్తులు శ్రీ స్వర్ణ కవచ శివదుర్గాదేవిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ తటాకం నాగలింగం శర్మ దంపతులు, కార్యనిర్వహణాధికారి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా చండీహోమం నిర్వహించారు.

### బాలాత్రిపుర సుందరిగా..

బోడుప్పల్ : దేవీశరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా బాలాత్రిపుర సుందరిగా శుక్రవారం అమ్మవారం భక్తులకు దర్శనమిచ్చారు. కాగా మాతానిమిషాంబికాదేవి అమ్మవారి అలంకరణ విషయమై సోషల్ మీడియాలో చర్చనీయాంశం అయింది.



ఉప్పల్ కన్యకాపరమేశ్వరి ఆలయంలో రాజరాజేశ్వరి దేవిగా..



బోడుప్పల్ ద్వారకానగర్‌లో ప్రత్యేక అలంకరణలో కొమురమ్మ అమ్మవారు



మహేశ్వరి అవతారంలో దర్శనం ఇచ్చిన శారదాంబ అమ్మవారు



భవానీ అలంకారంలో రామంతాపూర్ కట్టమైసమ్మ అమ్మవారు



గడిమైసమ్మ ఆలయంలో లక్ష్మీదేవి అమ్మవారు


## ధాన్యం సేకరణపై సమావేశం

మేడ్చల్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ) : వానాకాలం 2024-25 కాలానికి సంబంధించి ధాన్యం సేకరణపై మేడ్చల్ - మల్కాజిగిరి కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ధాన్యం సేకరణ ఇన్‌చార్జిలు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైస్‌మిల్లర్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జనవరి 2025 నుంచి రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డు దారులకు సన్న బియ్యం పంపిణీ చేయుటకు నిర్ణయించడం జరిగిందన్నారు. సన్నవడ్లు, దొడ్డ వడ్లు కొనుగోలు సంబంధించి ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రైతు ధాన్యం అమ్మిన 48 గంటలలోనే రైతుల ఖాతాలలో నగదు జమచేయడం జరుగుతుందన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు భాధ్యతగా వ్యహరించి ఇబ్బందులు జరగకుండా చూడాలన్నారు.

## లారీ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

ఘట్‌కేసర్, అక్టోబర్ 4 : లారీ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలోని అవుశాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. యు.ఆకాశ్ టి.ఎస్.30 జి.వై.4320 పల్సర్ బైక్ పై అవుశాపూర్ వైపు వెళ్తుండగా.. పెట్రోల్ బంక్ వద్ద ఇండికెటర్ లైట్ లేకుండా మలుపు తిరుగుతున్న టి.ఎస్.07 యు.ఎన్.6699 లారీ వెనుక నుంచి వస్తున్న బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఆకాశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. కేసు దర్యాప్తులో ఉన్నది.

## ప్రైవేటు ఉద్యోగి అదృశ్యం



నేరేడ్‌మెట్, అక్టోబర్ 4 : ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన నేరేడ్‌మెట్ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కాకతీయ నగర్‌లో నివాసముంటున్న చంద్రులు. రాజేశ్ ప్రైవేటు ఉద్యోగి. ఈ నెల 3వ తేదీ 5 గంటల సమయంలో సర్వీసింగ్ కోసం ఇచ్చిన యాక్టీవా టూ వీలర్‌ను తీసుకువస్తానని సికింద్రాబాద్ వెళ్లాడు. సాయంత్రం వరకు తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు అంతటా వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. శుక్రవారం భార్య, కుటుంబ సభ్యులు నేరేడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని విచారిస్తామని ఎస్సై తెలిపారు.